క్లుప్తంగా

నేడు కటకానిపల్లిలో 'గడప గడప'

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కటకానిపల్లిలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు కటకానిపల్లిలో నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కటకానిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, అధికారులు పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

విద్యార్థులతో వన మహోత్సవ ర్యాలీ

పొదిలి: స్థానిక నిర్మల కాన్వెంట్ విద్యార్థులు వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం, మొక్కల పెంపకం ప్రాధాన్యం విషయంపై నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించే బాధ్యత కూడా నాటిన వారే చూడాలని అవగాహన కల్పించారు. అనంతరం నిర్మల కాన్వెంట్ ఆవరణలో మొక్కలు నాటారు. కరస్పాండెంట్ సిస్టర్ రూబీ, హెడ్మిస్ట్రెస్ సిస్టర్ రాణి, సందీప్ పాల్గొన్నారు.

నేల రాలిన అరటి తోటల పరిశీలన

కంభం: ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి తోటలను ఉద్యానవన శాఖ అధికారి శ్వేత శుక్రవారం పరిశీలించారు. కంభం చెరువు ఆయకట్టు పరిధిలో సుమారు 50 నుంచి 60 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఇంకా పరిశీలించాల్సిన తోటలు ఉన్నాయని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో తోటలను పరిశీలించి నష్టం వివరాల నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంపై అవగాహన

కురిచేడు: మండలంలోని పెద్దవరం గ్రామంలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ సంస్థల ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న వనరులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి అన్ని వీధులు తిరిగి గ్రామంలో ఉన్న వనరులు ఏమిటి, వాటిని ఎలా ఉపయోగించుకోవచ్చు, సమస్యలు ఏమిటి అనే విషయాలు గుర్తించడంపై అవగాహన కలిగించారు. గుర్తించిన సమస్యలను, వనరులను అంచనా వేస్తూ ప్రణాళికలు రూపొందించారు. గ్రామంలో నీటి సమస్య ఉంటే అందరూ కలిసికట్టుగా ఎలా తీర్చుకోవచ్చో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ సంస్థ టీం జెస్సీ గ్లోరి, ఆశ కార్యకర్త మల్లేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ విధానాలపై శిక్షణ

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రైతు భరోసా సిబ్బందికి, రెవెన్యూ అధికారులకు 2023 ఖరీఫ్ సీజన్‌లో చేయబోయే ఈ క్రాప్ బుకింగ్ విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా జియో రెఫరెన్స్ విధానంలో పొలం అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారని తెలియజేశారు. అలాగే రైతులు వాస్తవంగా సాగుచేసిన పంటలను మాత్రమే నమోదు చేయాలని ఏఓ సూచించారు. ఏ రోజు ఏ సర్వే నంబర్లలో పంట నమోదు చేయబోతారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలియజేయాలని, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో ఎంత మేర సాగు భూమి ఉందో గుర్తించాలన్నారు. కౌలు చేస్తున్న రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేయాలని ఏఓ తెలిపారు.

ఎరువుల షాపులు తనిఖీ

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో ఎరువుల షాపులను శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతర్గత తనిఖీల్లో భాగంగా కనిగిరి ఏడీఏ ఈ.వెంకటరమణ, స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డిలు ఎరువుల షాపుల్లోని స్టాకు రికార్డులు, బిల్లు పుస్తకాలు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని కారణంగా విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు.

విద్యుత్ సిబ్బంది నిరసన

తాళ్లూరు (ముండ్లమూరు): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిబ్బంది శుక్రవారం నిరసన తెలిపారు. పీఆర్సీ అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జూనియర్ లైన్‌మెన్‌లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎల్ఎం ఎం.ప్రసాద్, ఎనర్జీ అసిస్టెంట్ నరసింహారావు, షిఫ్ట్ ఆపరేటర్ షేక్ హుస్సేన్ ఉన్నారు.

వ్యాపార అభివృద్ధికి రుణాలు

తాళ్లూరు (ముండ్లమూరు): మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో వ్యాపారం నిర్వహించుకునేందుకు అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పిస్తారని ఏపీఎం పాడిబండ్ల దేవరాజ్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి పథకం ద్వారా పాడి గేదెల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. మిగిలిన వారికి ఎలాంటి వ్యాపారం నిర్వహించుకోదలచినా అందుకు సంబంధించిన వివరాలు తెలియజేస్తే రుణాలు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీలు కోటేశ్వరమ్మ, సుచేంద్ర పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు రూ.25 లక్షలు మంజూరు

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



అట్లపల్లి చెరువును పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: మండల ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎన్ఏపీ ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులకు రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రకటించారు. స్థానిక అట్లపల్లి చెరువును, ఫిల్టర్‌బెడ్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగర్ కాలువకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారని, వాటిని చెరువుకు నింపి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అలాగే రైల్వే స్టేషను వద్ద పెద్దచెరువును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బీ రంగారావు, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి వివరించారు. ఎస్సీకాలనీ వారికి శ్మశాన వాటికలో గది నిర్మాణం, చుట్టూ కంచె ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. మండల ప్రజల తాగునీటి అవసరాల కోసం 13 ఏళ్ల క్రితం అప్పటి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి రూ.10 కోట్లు మంజూరు చేయించారని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి గుర్తుచేశారు. ఆ పథకం కొన్ని కారణాల వలన సఫలం కాలేదని, కానీ పైపులైన్లు, గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారని, వాటిని జేజేఎం పథకంలో సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. పెద్దచెరువులో వంద ఎకరాలు తాగునీటి చెరువుగా అభివృద్ధి చేస్తే మండల ప్రజల తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. పెద్ద చెరువు తూము పూడిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దాని మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వెంకాయమ్మను కోరారు. జెడ్పీచైర్‌పర్సన్ వెంట సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ దా బాషా, నాయకులు నారు శ్రీనివాసరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, గోగులమూడి లింగారెడ్డి, వీరగంధం కోటయ్య, నుసుం ప్రతాపరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, ముప్పా శ్రీనివాసరావు, వెలుతుర్ల ఏడుకొండలరెడ్డి, పాపయ్య, కాకర్లకృష్ణారెడ్డి, బొరిగొర్ల గోవిందు, ఎస్‌నాగిరెడ్డి, ఆసుపల్లి చెన్నారెడ్డి, దాసరి రమేష్, పత్తిసుబ్బయ్య, బత్తుల చిన సుబ్బయ్య, ఎంపీడీఓ వసంతరావునాయక్, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యం థావూనాయక్ ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం మైదుకూరు రూటుకు వెళ్లే రెండు హయ్యర్ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుభవజ్ఞులైన డ్రైవర్లతో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులను వారి గమ్యస్థానంకు సురక్షితంగా చేరవేయడంలో ఎంతో జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరం సహకరించాలన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, డిపో మేనేజర్ చంద్రశేఖర్, సీఐ మౌనిక, ఎస్‌టీఐ బి.నాయక్, ఎంఎఫ్ బీటీ ప్రసాద్, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు నంద్యాల బాలు, ముద్దర్ల శ్రీను, కావేటి ఈశ్వర్ పాల్గొన్నారు.

అమర్‌ను కలిసిన కృష్ణమోహన్‌రెడ్డి



అమర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

మార్కాపురం టౌన్: జాతీయ మీడియా ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్‌ను మార్కాపురం మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై నియోజకవర్గంలోని ప్రజలకు అందుతున్న తీరును కృష్ణమోహన్‌రెడ్డిని అమర్ అడిగి తెలుసుకున్నారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రజల్లో అనూహ్య స్పందన లభిస్తోందని, అందుకు నిదర్శనం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అన్నారు. రాష్ట్రంలో ప్రజలు సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉన్నారని వివరించారు. ఈయనతో పాటు ఎస్‌ఆర్‌సీ ల్యాబరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎలూరి రామచంద్రారెడ్డి ఉన్నారు.

మేకలవారిపల్లిలో హౌసింగ్ డే



మొక్కలు నాటుతున్న ఈఈ వెంకటస్వామి, అధికారులు

తర్లుపాడు: మండలంలోని మేకలవారిపల్లిలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హౌసింగ్ ఈఈ వెంకటస్వామి పాల్గొన్నారు. లేఔట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం పేదల కోసం ఇంటి నిర్మాణాలు చేపడుతోందన్నారు. ఖరీదైన ఇంటి స్థలంతో పాటు నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వమే సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాలు చేపట్టని వారు త్వరగా చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం లేఔట్‌లో పండ్ల మొక్కలు నాటారు. డీఈ పవన్‌కుమార్, ఏఈ నిర్మల్‌బాబు, పంచాయితీ సెక్రటరీ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సైజులు, నాయకులు సుబ్బారెడ్డి, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పల్లెవనం పార్కును స్క్వాడ్ డీఎఫ్‌వో పరిశీలన

● అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులతో కలిసి వచ్చి పరిశీలన

● అన్నీ చూసి వెళ్లేటప్పుడు ఫిర్యాదికి సమాచారం



పల్లెవనం పార్కును పరిశీలిస్తున్న స్క్వాడ్ రేంజ్ అధికారి మారుతిప్రసాద్

దర్శి: ఇటీవల పల్లెవనం పార్కులో రూ.45 లక్షల అవినీతి జరిగిందని వచ్చిన ఫిర్యాదుల మేరకు స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతి ప్రసాద్ పల్లెవనం పార్కులను శుక్రవారం పరిశీలించారు. గతంలో దర్శి ఫారెస్ట్ బీట్ అధికారిని అమరకు.. రేంజ్ అధికారి ఏవీ నాగేంద్రరావు లెక్కలు చెప్పాలంటూ మెమో ఇచ్చారు. దీంతో తనకు సంబంధం లేకపోయినా జరిగిన అవినీతి పై తనకు మెమో ఇచ్చారని గుంటూరు అటవీ స్క్వాడ్ డీఎఫ్ఓ కు ఇక్కడ జరిగిన అవినీతిపై నిగ్గు తేల్చాలని రాతపూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చిన మారుతి ప్రసాద్ ఫిర్యాదురాలికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తీసుకుని వచ్చి పార్కును పరిశీలించారు. అటవీ శాఖ స్క్వాడ్ అధికారులు వచ్చారని సమాచారం తెలుసుకున్న విలేకరులు అక్కడకు వెళ్లగానే హడావిడిగా కారెక్కి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. సమాధానం చెప్పకుండా ఎందుకు వెళ్తున్నారని విలేకరులు ప్రశ్నించగా స్థానిక బీట్ అధికారి లేనందున వెళ్తున్నామని సమాధానం ఇచ్చారు. రూ.45 లక్షల అవినీతిపై విలేకరులు ప్రశ్నించగా అవినీతా ఎక్కడ... ఏం అవినీతి అని ఎదురు ప్రశ్నించడం పై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై బీట్ అధికారి అమరను వివరణ కోరగా ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం వలన తన బీట్ పరిధిలో దూరప్రాంతంలో ఉన్నానని చెప్పారు. పార్కుకు వచ్చి అన్నీ చూసి వెళ్లే సమయంలో సమాచారం ఇచ్చారని చెప్పారు. తాను వస్తున్నట్లు చెప్పినా ఒంగోలు రమ్మని వెళ్లి పోయారన్నారు.

యర్రబాలెం సర్పంచ్‌కు డాక్టరేట్



మద్దు శ్రీనివాస్



సీహెచ్ నాగేశ్వరరావు

కంభం: మండలంలోని యర్రబాలెం సర్పంచ్ మద్దు శ్రీనివాస్ యాదవ్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోని మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్యాత్మిక, మానసిక స్థితిగతులపై పరిశోధన చేసినందుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

చింతగుంట్ల వాసికి కూడా..

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్లకు చెందిన సీహెచ్ నాగేశ్వరరావుకు అర్థశాస్త్రంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థశాస్త్రంలో ప్రకాశం జిల్లాలో గని కార్మికుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై పరిశోధన చేసినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు డాక్టర్ ఏకే వీఎస్ఎస్ఆర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. నాగేశ్వరరావు మార్కాపురం పట్టణంలో గాంధీ బజారు సచివాలయంలో వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు.

పుట్టుకతో వచ్చే వ్యాధులకు ప్రత్యేక చికిత్స

మార్కాపురం రూరల్: మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో చిన్న పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలకు చికిత్స అందించనున్నట్లు ఆర్‌బీఎస్‌యూ స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భువన లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్యశాలను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యు లోపం, వంకర పాదాలు, గ్రహణమొర్రి, పెదవి చీలిక, అంగిట్లో చీలిక, పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, విటమిన్ లోపాలు, తీవ్ర దృష్టి, వినికిడి, దంత సమస్యలు, చర్మవ్యాధులు, నాడీ సంబంధిత సమస్యలను జిల్లా వైద్యశాలలో డీఈఐసీ సెంటర్‌ను ప్రారంభించి స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మార్కాపురం డివిజన్‌లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ కె.కిశోర్, శ్రీహరిరెడ్డి, సైకాలజిస్టు సుబ్బారావు, వైద్యులు యశ్వంత్‌బాబు, అశోక్‌రెడ్డి, అమూల్య, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కొనకనమిట్ల: అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రం పండగ నిర్వహించారు. మొహర్రం పండగను పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారు జామున చిన్న సరిగేసు ఉత్సవం జరిపారు. పీర్లతో ఉత్సవం చేస్తూ భక్తులు నైవేద్యాలు సమర్పించి భక్తి చాటారు. మండలంలోని బచ్చలకూరపాడు, గార్లదిన్నె వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, గనివానిపాడు, నాయుడుపేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల చావిడీలను ముస్తాబు చేశారు. శనివారం రాత్రికి పెద్ద సరిగేసు ఉత్సవాలు, హోమగుండాలు జరిపేందుకు నిర్వాహకులు అన్నీ ఏర్పాట్లు చేశారు.

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో పీర్లపండగను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తర్లుపాడు, మార్కాపురంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు ఖాశీం స్వామి వారికి మొక్కులు చెల్లించి గుండం చుట్టూ తిరిగి అనంతరం నైవేద్యం సమర్పించారు. భక్తుల రాకతో తుమ్మలచెరువు గ్రామం జనసందోహంగా మారింది.

గుండ్లమోటుకు చేరిన వర్షపు నీరు

గిద్దలూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని గుండ్లమోటు నల్లమల అటవీ ప్రాంతం నుంచి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో స్థానికులు గుండ్లమోటు వద్దకు వెళ్లి వర్షపు నీటి పారుదలను చూసి ఆనందించారు. గుండ్లమోటులో నీరు నిల్వ ఉండటంపై చుట్టుపక్కల బోర్లకు పుష్కలంగా నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): ఆరోగ్య పరిరక్షణకు పర్యావరణం దోహద పడుతుందని మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు తెలిపారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రజానగరం, మల్కాపురం రైతు భరోసా కేంద్రాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, వీఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి



నూతన దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: యువత స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన కంభం రోడ్డులో కె.శ్రీనివాస్ ఏర్పాటు చేసిన నూతన దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగం రాలేదని నిరుత్సాహ పడకుండా వ్యాపారాలు ప్రారంభించుకుని తనతో పాటు పలువురికి ఉపాధి చూపాలని సూచించారు. వ్యాపారాలు ప్రారంభించుకునేందుకు బ్యాంకులు ఇస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్త అర్జునరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సాయిబాబా మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు, వీరాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్త కొండయ్య, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు మీటర్లు ఏర్పాటు చేయాలి

ముండ్లమూరు: నిర్మాణాలు పూర్తి చేసుకున్న జగనన్న కాలనీలకు నూతన మీటర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ డీఈఈ కే పిచ్చయ్య అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న లేఅవుట్ లకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అలానే నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లకు విద్యుత్ మీటర్లను బిగించాలన్నారు.

డీబీటీతో రూ.2.30 లక్షల కోట్లు ప్రజలకు అందజేత



మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, చైర్మన్‌లను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

● వచ్చే ఏడాది నుంచి మార్కాపురం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ప్రవేశాలు

● మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పక్కన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వివిధ పథకాలకు సంబంధించి ప్రజలకు 2.30 లక్షల కోట్ల రూపాయలను డీబీటీ ద్వారా అందజేశారని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. శుక్రవారం మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్లు మంత్రి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ తాను మార్కాపురం మున్సిపల్ ఓటర్‌నని, ప్రతి ఒక్క విషయం తెలుసని, మార్కాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు. 3 కోట్ల రూపాయలతో మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి అనుమతి ఇస్తానని, వెంటనే ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. ఇప్పటికే పులివెందుల, డోన్ మున్సిపల్ కార్యాలయాలను ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్నీ మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. జగనన్న పాలనలో జవాబుదారీ తనానికి పారదర్శక పాలన ఉందన్నారు. ప్రతి రూపాయి పేద వారికి నేరుగా అందాలనే లక్ష్యంతో డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో గతంలో కంటే మంచి ప్రతిపాలన ఉందన్నారు. సేవ చేసేందుకు మున్సిపల్ శాఖకు మంచి అవకాశం ఉందని, కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన పారిశుధ్యం, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. పారిశుధ్య కార్మికుల కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వారి జీతాలు పెంచారన్నారు.

ప్రత్యేక నిధులివ్వండి: ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులివ్వాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మంత్రి సురేష్‌ను కోరారు. ఇప్పటికే వార్డుల అభివృద్ధి కోసం రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, వాటిని ఆమోదించాలని కోరారు. ముఖ్యమంత్రి సహకారంతో మెడికల్ కాలేజీ, రూ.22 కోట్లతో ఆరు వార్డుల్లో సాగర్ నీటి సరఫరాకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఏడాది నుంచి మార్కాపురం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతిచ్చిందని ఎమ్మెల్యే చెప్పారు. మంత్రి సురేష్ చొరవతో అమృత్ 2.1 పథకంలో ఫేజ్-1లో మార్కాపురానికి రూ.3 కోట్లు, ఫేజ్-2 రూ.62 కోట్లు, పొదిలి నగర పంచాయతీకి ఫేజ్-1కు రూ.7.30 కోట్లు, ఫేజ్-2కు రూ.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీలో ఇప్పటి వరకూ రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం కౌన్సిలర్లు మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి కమిషనర్ సుభానీ, ఏఈ ఆదినారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు మంత్రి సురేష్ నివాళి

మార్కాపురం టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగనన్న మహిళా మార్ట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్.. అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను అనుసరించి పేదల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ, ఇన్‌చార్జి కమిషనర్ సుభానీ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వెండితెరపై కొమరోలు కుర్రోడు



సినిమాలోని ఓ సన్నివేశంలో ఆదిత్యరెడ్డి

కొమరోలు: మండలంలోని సర్వీరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సాధారణ రైతు బద్వేలు జనార్దన్‌రెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి చిన్నతనం నుంచి నటనపై పిచ్చితో చదువు పూర్తి చేసిన వెంటనే సినీరంగం వైపు పయనమయ్యాడు. తాను హీరోగా ఒక్కరోజు-48 హవర్స్ అనే సినిమాలో ఆదిత్యరెడ్డి నటించాడు. ఈ సినిమా డైరెక్టర్‌గా నిరంజన్ మండా, ప్రొడ్యూసర్‌గా కృష్ణారెడ్డి, ఐరెడ్డిలు ఉన్నారు. ఒక్కరోజు-48 హవర్స్ సినిమాలో చాన్స్ రావడమే ఆలస్యం కథ బాగుండటంతో కమిట్ అయ్యాడు. 25 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసినట్లు ఆదిత్యరెడ్డి తెలిపాడు. చిన్న బడ్జెట్ సినిమా తీసినా టైం ట్రావెలింగ్ పాయింట్‌ను తీసుకుని 2.01 గంటల నిడివి గల సినిమాలను ఆద్యాంతం ఆసక్తికరంగా సినిమా తీసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం లొకేషన్స్‌లో సినిమా తీసినట్లు చెప్పారు. ఒక్కరోజు-48 హవర్స్ సినిమా తెలుగు రాష్ట్రాల్లో శనివారం విడుదల అవుతుండగా గిద్దలూరులోని వెంకటేశ్వర థియేటర్‌లో ఉదయం 8 గంటలకు స్పెషల్ షో వేస్తున్నట్లు సినీ హీరో ఆదిత్యరెడ్డి తెలిపారు.

స్వచ్ఛమైన నీరు అందించాలి

● బూచేపల్లి వెంకాయమ్మ



ఫిల్టర్‌బెడ్లు పరిశీలిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎటువంటి రాజీ పడకుండా స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశించారు. దర్శి ఎన్ఎస్‌పీ కాలువపై శుక్రవారం పర్యటించారు. ఎన్ని క్యూసెక్కుల నీరు వస్తుంది, ఎప్పటి లోపు ట్యాంకులు నింపుతారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిల్టర్‌బెడ్‌లను, ఆర్ఎస్ఎస్ ట్యాంకును, జనరేటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో జనరేటర్, మోటార్లు, ఇతర అవసరాల కోసం జెడ్పీ నుంచి రూ.50 లక్షల నిధులు విడుదల చేశారు. అధికారులు ఎక్కడా రాజీపడకుండా నీటిని త్వరితగతిన ట్యాంకులు నింపాలని ఆదేశించారు. కేవలం తాగునీటి కోసమే సాగర్ జలాలు విడుదల చేశారని, కేటాయించిన నీటిని ఎటువంటి పొరపాట్లు జరగకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దర్శి ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చాలనే ఉద్దేశంతో మరో ఆర్ఎస్ఎస్ ట్యాంకు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ప్రముఖ హోమియో వైద్యులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ బాషా, కురిచేడు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, వీరగంధం కోటయ్య, మాజీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి, బసిరెడ్డిపల్లె సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి, కొల్లా ఉదయభాస్కర్, మాజీ సర్పంచ్ నలదిమ్ము రమణారెడ్డి, వెన్నపూస బాపిరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.